# నలుపు, తెలుపు, కొన్ని రంగులు...

ప్రసిద్ధ కన్నడ రచయిత్రుల కథలు



రంగనాథ రామచంద్రరావు

# నలుపు, తెలుపు, కొన్ని రంగులు...

## (ప్రసిద్ధ కన్నడ రచయిత్రుల కథలు)

అనువాదం

**రంగనాథ రామచంద్రరావు**

**లక్ష్మి ప్రచురణలు**

బేగంపేట

హైదరాబాద్-16

**NALUPU, TELUPU, KONNI RANGULU ...**

*(An Anthology of Translated Stories)*

**Ranganatha Ramachandra Rao**
Mobile: 9290050229

© Writer

| | | |
|---|---|---|
| Cover Design | : | Ramanageevi |
| First Edition | : | October 2013 |
| For Copies | : | V. Lakshmi Kumari<br>1-11-163/1<br>4th Floor, Flat No 402,<br>Stephen's Cottage,<br>Shyamal Building,<br>Begumpet,<br>Hyderabad - 500 016<br><br>Palapitta Books<br># 16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Ph.040-27678430<br>palapittabooks@gmail.com<br><br>Srikirishnadevaraya Grandhamala<br>Hindupuram |
| Printed at | : | Marvellous Printers<br>Opp. Bharat Women's Degree College<br>Nallakunta<br>Hyderabad-44 |
| Price | : | **Rs. 120 /-** |

# అనువాదమే ఆరాధనగా...

ఇరవైయవ శతాబ్దపు మొదటి దశకంలోనే పంజే మంగేశరాయలు నుంచి కన్నడ సాహిత్య ప్రపంచాన్ని ప్రవేశించిన చిన్నకథా ప్రక్రియ తరువాత కెరూరు వాసుదేవాచార్యులు, ఎం.ఎస్. కామత్, మాస్తి, ఆనంద బేటెగేరి, కృష్ణశర్మ, బేంద్రె, కువెంపు, సేడియాపు కృష్ణభట్ట, కడేంగోడ్లు శంకరభట్ట మొదలైన నవోదయ కథకుల చేతుల్లో అనేక ప్రయోగాలకులోనై పరిపుష్టమై అభివృద్ధి చెందింది. 1940-50 దశకంలో అ.న.కృ, నిరంజన, బసవరాజ కట్టిమని, చదురంగ, త.రా.సు. మొదలైన అభ్యుదయ కథకుల వల్ల నూతన సంవేదనను పొంది కథ వాస్తవిక నెలకు విస్తరించింది. ఈ రచయితలు చిన్న కథకు వాస్తవ జీవితంతో నేరుగా సంపర్కాన్ని ఒదిగించారు. అదే విధంగా ఇరవైయవ శతాబ్దాపు రెండవ దశకంలోనే నంజనగూడు తిరుమలాంబ, ఆర్. కళ్యాణమ్మ కథా రచన ఆరంభించారు. అయితే ఆధునిక సంవేదనా కథలను రాసినవారిలో **కొడగిన గౌరమ్మ** మొదటివారు.

శ్యామలదేవి బెళగాంవకర, సరస్వతిబాయి రాజవాడె, సరస్వతీదేవి గౌడర, ఎచ్.వి. సావిత్రమ్మ, శాంతాదేవీ మాళవాడ మొదలైనవారు స్వాతంత్ర్యానికి పూర్వమే చిన్నకథలో తమ స్త్రీపరమైన సంవేదనలకు ఆకారం ఇవ్వడానికి ప్రయత్నించారు. స్త్రీ వ్యతిరేక మౌల్య వ్యవస్థలో స్త్రీ కష్టాలు, భయాలు కేంద్రంగా చేసుకుని, స్త్రీ విమోచనా ఆశయాలకు చిన్నకథలో గొంతు ఇచ్చారు. పాశ్చాత్య దేశాల మహిళా ఉద్యమాలు, వలస రాజ్య పాలనలో భారతంలో జరిగిన స్త్రీ విమోచనా ప్రయత్నాలు కన్నడ రచయిత్రులలో స్త్రీ పరమైన ప్రజ్ఞను వికసింపజేశాయి. స్త్రీపరమైన చింతనలు, చర్చల వల్ల ప్రేరణపొంది, ఆ నాటి కన్నడ రచయిత్రులు చిన్నకథను స్త్రీ సమస్యల విశ్లేషణకు తగిన మాధ్యమంగా ఉపయోగించారు. రాను రాను అభ్యుదయవాదుల ప్రతిఘటనా సత్వాన్ని ఒంటబట్టించుకుని అభివృద్ధి చెందుతున్న చిన్నకథా విశిష్టరూపం, సంవేదనలవల్ల **దేవాంగనా శాస్త్రి** ప్రభావితులయ్యారు. దేవాంగనాశాస్త్రి అతిపిన్న వయస్సులోనే చిన్నకథల వైపు మొగ్గుచూపారు. తమ వివాహానికి పూర్వం, తమ పదహారవ ఏట 'వేణిసంహారం' (రచనా కాలం1941) కథను ఆమె రాయటం గమనించ వలసిన విషయం. ఆమె కథలు కౌటుంబిక, సామాజిక సమస్యలకు- సందిగ్ధతలకు అద్దం పట్టాయి.

ఈ ఇద్దరు స్త్రీ మూర్తుల కథలతో ప్రారంభమయ్యే ఈ కథాసంకలనం ఇలా రూపొందడానికి ముందు ...

సమకాలీన కన్నడ కథా సంకలనం తీసుకురావాలనే ఆలోచన నా మనసులో రూపుదిద్దుకుంది. ప్రియ మిత్రులు ప్రసిద్ధ కన్నడ రచయిత కుం. వీరభద్రప్పగారిని సంప్రదించాను. వారు సంతోషంగా నా ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తూ కన్నడ రచయితల, రచయిత్రుల గురించి వారి రచనల గురించి ప్రస్తావించి వారి ఫోన్ నెంబర్లు అందించారు.

అప్పుడే నా మనస్సులో ఒక సంకలనానికి బదులుగా రెండు సంకలనాలు తెస్తే? అనే మరో ఆలోచన వచ్చింది. కన్నడ రచయితల సహకారంతో 12 మంది రచయితలతో ఒక సంకలనం సిద్ధమైంది. 15 మంది మహిళా రచయిత్రుల సహకారంతో మరొక సంకలనం రూపుదిద్దుకుంది. ఈ విషయంలో కుం. వీరభద్రప్పగారితోపాటు నాకు రచయిత, కన్నడ అనువాదకుడు స. రఘునాథ ఎంతో అండగా నిలిచారు. రఘునాథగారు రచయితలతో, రచయిత్రులతో నా తరపున స్వయంగా మాట్లాడి వాళ్ళ ఫోన్ నెంబర్లు, వారి రచనలు, అనుమతులు సేకరించి నాకు పంపేవారు. శ్రీమతి విజయా శంకరగారు కొందరు రచయిత్రుల చిరునామాలు, కథలు సంపాదించి పంపారు.

ఈ సందర్భంగా నేను మరో ఇద్దరిని తప్పకుండా గుర్తు చేసుకోవాలి. ఎల్. సి. సుమిత్రగారు తమ కథతోపాటు, నేను కొడగిన గౌరమ్మగారి కథను అడగ్గానే, శ్రమ అనుకోకుండా ఆ కథను జిరాక్స్ చేసి పంపారు. అదే విధంగా మాలతి ముదకవిగారు తమ కథతోపాటు దేవాంగనా శాస్త్రిగారి బంధువులతో మాట్లాడి నాకు వారి కథాసంకలనాన్ని తెప్పించి పంపారు. వీరిరువురికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

అదే విధంగా కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత డా. వైదేహిగారు కోరిన వెంటనే తమ కథ 'అక్క'ను పంపారు, ప్రముఖ స్త్రీవాద రచయిత్రి వీణా శాంతేశ్వరగారు, డా. .వినయాగారు, డా. సంధ్యారెడ్డిగారు, సునందా ప్రకాశ కడమెగారు, సుమంగలాగారు, డా. జయశ్రీ సి. కంబారగారు, శుభదా ఆ.అమినభావిగారు, సి.ఎన్.ముక్తాగారు, విజయశంకర్‌గారు, లీలా మణ్ణాలగారు –తమ కథలను అందించి ఈ సంకలనం ఇలా రావడానికి కారకులయ్యారు. అందరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ–

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థికభారాన్ని వహించిన శ్రీమతి లక్ష్మీకుమారిగారికి హృదయపూర్వకమైన కృతజ్ఞతలు.

ఈ సంకలనానికి కోరిన వెంటనే సహృదయంతో ఎన్నో పనుల వొత్తిడి మధ్య కూడా సావకాశంగా చదివి ముందు మాట రాసిన శ్రీమతి డా. సి. మృణాళినిగారికి ప్రత్యేకించి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ–

త్వరలో మూడవ అనువాద కథల సంకలనంతో మీ ముందుకు వస్తానని మనవి చేసుకుంటూ –

–రంగనాథ రామచంద్రరావు

# విషయసూచిక


1. కొడిగిన గౌరమ్మ / ఆహుతి ........................................ 11

2. దేవాంగనా శాస్త్రి / వేణీసంహారం .................................. 17

3. డా. వైదేహి / అక్కు .................................................. 22

4. డా. వీణా శాంతేశ్వర / విముక్తి ...................................... 33

5. డా. సుమిత్రా / పిచ్చుకల వాగు సాక్షిగా ............................ 42

6. డా. వినయా / ఒక వ్యక్తిగత పత్రం ................................ 52

7. డా. సంధ్యారెడ్డి / ఒక ఆత్మకథ ....................................... 60

8. సునందా ప్రకాశ కడమె / చిట్టి పాదాల గురుతు ................. 68

9. సుమంగలా/ అడుగు జాడలు ........................................ 76

10. డా. జయశ్రీ సి. కంబార / ముఖాముఖి ............................ 86

11. మాలతి ముదకవి / గంధవతీ పృథ్వీ ................................ 93

12. శుభదా అ.అమినభావి / నలుపు, తెలుపు, రంగుల చిత్రాలు .............. 99

13. సి.ఎన్. ముక్త / నాన్న ............................................. 110

14. విజయా శంకర / అసహాయులు ..................................... 118

15. లీలా మణ్ణాల / మునిమాపు పక్షులు ................................ 125

మూల రచయిత్రుల వివరాలు ........................................ 131

అనువాదకుడి వివరాలు .............................................. 135

కొడగిన గౌరమ్మ

# ఆహుతి

నేను ఎం.ఏ. పాసయ్యాను. నా తల్లితండ్రులు నాకు పెళ్ళి చేయాలని అమ్మాయి కోసం వెదుకుతున్నారు. చివరికి అమ్మాయిని నిశ్చయించారు. మా ఇంటి నుంచి పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లెలో ఆమె ఇల్లు. ఆమెకూ తల్లితండ్రులు ఉన్నారు. అయితే వాళ్ళు చాలా బీదవాళ్ళట. నాకేమో ఐశ్వర్యవంతుల ఇంటి అల్లుడు కావాలని చాలా ఆశగా ఉంది. ఇంగ్లాండుకు వెళ్ళి బ్యారిస్టర్ కావాలని బలమైన కోరిక. ఇంగ్లాండుకు వెళ్ళాలంటే డబ్బు కావాలి. నా కోసం బాగా ఖర్చు చేసేంత అనుకూలం నా తండ్రికి లేదు. ధనవంతుల అల్లుడైతే నేను ఇంగ్లాండుకు సులభంగా వెళ్ళొచ్చు. అందువల్ల ఆ పేదింటి పిల్లను పెళ్ళి చేసుకోడానికి నా మనస్సు ఒప్పుకోలేదు.

సాయంకాలమైంది. తిరగడానికి వెళ్లినవాడిని అప్పుడే ఇంటికి తిరిగి వచ్చాను. నా తండ్రి చాలా ఆచారవంతులు. ప్రతీరోజు తప్పకుండా సంధ్యావందనం ఆచరించేవారు. నేనూ చేయాలని ఆయన కోరిక. తిరగడానికి వెళ్ళిన చోట స్నేహితులతో మాట్లాడే సంబరంలో సంధ్యావందనానికి సమయం కావటమూ నాకు తెలియలేదు. నేను ఇంటికి వచ్చేసరికి తండ్రిగారు లోపల జపం చేసుకుంటున్నారు. నేను దుస్తులను మార్చుకోవడానికి నా గదిలోకి వెళ్ళాను. నా చెల్లెలు విజయ అక్కడ కూర్చుని చదువుకుంటోంది. నేనామెను 'వి' అని పిలిచేవాడిని. సాధారణంగా సంధ్యా సమయంలో ఆమె దేవుడి కీర్తనలు పాడుతూ దేవుడింట్లో ఉండటం అలవాటు. ఈ వాళ నాగదిలో కూర్చుని ఉండటం చూసి, "ఏం చదువుతున్నావు 'వి' ?" అని అడిగాను. చదువుతున్న పుస్తకాన్ని బల్ల మీదికి విసిరి "చదవటం లేదూ, ఏమీ లేదు. ఈ పాడు పుస్తకాల్లో చదవటానికి ఏం ఉంది?" అంది. "అదేంటి వి? నీవు పాడటం లేదా?" అన్నాను. "పాడటం అప్పుడే అయిపోయింది" అందామె. నేను వేసుకున్న కోటు విడిచి, టై విప్పుతున్నాను. అప్పుడామె 'అన్నయ్యా, నీకు అంగీకారమేనా?" అని అడిగింది. నేను , "ఏమిటి అంగీకారం?" అని అడిగాను. "ఏమీ తెలియదు పాపం ! ఆ అమ్మాయిని వివాహం చేసుకోటానికి నీకు అంగీకారమేనా అని అడిగితే ఏదో అంటున్నావు?" అని అంది. "ఆమెను నేను చూడనే లేదు. నేనేమని జవాబివ్వను?" అని నేనన్నాను. అప్పుడు విజయ, "అన్నయ్యా, నేను ఆమెను చూశాను.

ఆమె నీకు అన్ని విధాల యోగ్యురాలు. చదవనూ రాయనూ వచ్చు. చూడటానికి చాలా అందంగా ఉంటుంది" అంది. అప్పుడు నేను, "వరకట్నం ఎంతిస్తారు?" అని అడిగాను.

విజయ అంది: "అన్నయ్యా, నాన్నకు వరకట్నం తీసుకోవటం ఇష్టం లేదు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. అయితే అమ్మాయి రతీదేవిలా ఉంది. వాళ్ళే అయిదు వందల రూపాయలు ఇస్తామని అన్నారు. అది తీసుకోవటానికీ నాన్నకు ఇష్టం లేదు". నేనన్నాను, "వి, నాకు లండన్ వెళ్ళి లా చేయాలన్న కోరిక ఉంది. అందుకు అయ్యే ఖర్చును ఇచ్చేటట్టయితేనే నేను ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటాను. లేకుంటే లేదు." అప్పుడు విజయ, "అన్నయ్యా, నీవు ఎం.ఏ. చేసినవాడివి. నీ నోటి నుంచి ఇలాంటి మాటలు రావచ్చునా? నిన్ను నీవు ఎందుకు అమ్ముకోవాలని అనుకుంటున్నావు?" అని కాస్త కోపంగానే అంది. నేను జవాబివ్వలేదు. ఆమె కోపగించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

*****

జపం చేసుకుని బయటికి వచ్చి కూర్చున్నాను. మా నాన్న కూడా జపం ముగించుకుని బయటికి వచ్చి, "ఏమిటి? నువ్వు విజయ దగ్గర ఏమన్నావు?" అని అడిగారు. నేను మాట్లాడలేదు. "పై చదువులకు అయ్యే ఖర్చుకు డబ్బు ఇస్తేనే నీవు వివాహం చేసుకుంటానన్నావట. వాళ్ళు పేదవాళ్లు. ఇంట్లో ఆరేడు మంది ఆడపిల్లలున్నారు. ఎక్కడి నుంచి డబ్బులు తీసుకురాగలరు? నీవు ఏమీ తెలియని చిన్నపిల్లవాడివి కావు. అమ్మాయి లక్షణంగా ఉంది. నీవు గొప్పవాళ్ళ అల్లుడై లండన్ వెళ్ళటానికి నేను అంగీకరించను. ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే ఇక్కడే లా చదువుకయ్యే ఖర్చును ఏదో విధంగా నేను సర్దుతాను. నా మాట వినకపోతే నీవు నా కొడుకువే కావు. బాగా ఆలోచించుకుని రేపు చెప్పు" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయారు. కొద్దిసేపటి తరువాత అమ్మ భోజనాలకు పిలిచింది. నాకు ఏ మాత్రం తినాలనిపించేదు. వద్దని చెప్పాను.

ఆ రాత్రి అందరు పడుకున్న తరువాత నేను బయటికి వచ్చాను. నా మనస్సు కోపంతో చంచలమైంది. ఆ అమ్మాయిని పెళ్ళాడాలనే ఇచ్ఛ నాకు ఏ మాత్రమూ లేదు. తండ్రి ఎదుట నుంచుని అలా చెప్పే ధైర్యం నాకు లేదు. ఆందువల్ల ఆ రోజు రాత్రే ఇల్లు వొదిలి బయలుదేరాను. మా పల్లె నుంచి రైల్వేస్టేషన్ నాలుగుమైళ్లు. నేను అక్కడికి చేరేసరికి పన్నెండు గంటలైంది. స్టేషన్ నుంచి రైలు బయలుదేరడానికి ఇంకా పది నిముషాలు ఉంది. ఆలోపు మదరాసుకు ఒక టికెట్టు తీసుకుని వెళ్ళి ఒక కంపార్ట్‌మెంట్లో కూర్చున్నాను. నేను కూర్చున్న చోట వేరెవరూ లేరు. ముందు గతి ఏమిటని ఆలోచిస్తూ కూర్చున్నట్టే నిద్ర పట్టేసింది. అలా ఎంత సేపు నిద్రపోయానో ఏదో శబ్దమైనట్టయి నాకు నిద్రాభంగమైంది. కళ్ళు తెరిచి చూశాను. పున్నమి చంద్రుడు కిటికీ గుండా లోపలికి తొంగి చూస్తున్నాడు. వెన్నెల కాంతిని, ఆ కాంతిలో ఎదుటి బెంచీ మీద మరొకరు

కూర్చుని ఉండటాన్ని చూశాను. మా ఊరి నుంచి బయలుదేరేటప్పుడు నేనొక్కణ్ణే ఉన్నాను. మధ్యలో ఎవరో ఎక్కి కూర్చుని ఉండొచ్చని ఆలోచిస్తూ పడుకున్న చోటునుంచి లేచి కూరున్నాను. నా ఎదుట కూర్చున్న వ్యక్తి ముసలివాడు. అయితే ముసలివాడైనప్పటికీ కుర్రవాడిలా డ్రెస్ చేసుకున్నాడు. చూసిన వెంటనే ముసలివాడని తెలియలేదు. అతను డబ్బున్నవాడై ఉండొచ్చని అతడి వేషభూషణాల వల్ల వ్యక్తమవుతోంది. అతడు ఐశ్వర్యవంతుడై ఉండొచ్చనే భావన కలిగిన వెంటనే అతడితో పరిచయం చేసుకోవాలనే ఆశ కలిగింది. అతను నన్నే చూస్తూ కూర్చున్నా పలకరించేలా కనిపించలేదు. నేనే పలకరించాల్సి వచ్చింది. "అయ్యా, దయచేసి టైమెంతో చెప్పగలరా?" అని అడిగాను. అతడు చేతి గడియారాన్ని చూసి, "రెండుకు ఇంకా పది నిముషాలున్నాయి" అన్నాడు. ఆ ముసలివాడు మంచి మాటకారి. నేను పలకరించిన తరువాతే అతను మాటలు ప్రారంభించాడు. చివరికి మదరాసు చేరుకునేలోగా మేమిద్దరం మంచి స్నేహితులమై పోయాం.

ఆ ముసలివాడు ఒక రత్నాల వ్యాపారి. నా గురించి అడగటంతో, 'నేనొక పేదవాడి కొడుకునని, ఎం.ఏ. పాసయ్యానని, ఉద్యోగాన్వేషణలో మద్రాసుకు బయలుదేరాననీ చెప్పాను. ఏ పనీ దొరక్కపోతే వచ్చి తనకు కనిపించమని అతనన్నాడు. అంతలో మద్రాసు చేరాం. నేను చదువుకునే రోజుల్లో బస చేసిన వై.ఎం.సి.ఏ.కే వెళ్ళాను. లా చేస్తున్న నా స్నేహితులు చాలా మంది అక్కడ ఉన్నారు. వారితో మాట్లాడుతూ ఆ రోజు అక్కడ ఉండిపోయాను.

మరుసటిరోజు నుంచి ఉద్యోగాన్వేషణ ప్రారంభించాను. నా దురదృష్టం వల్ల ఎక్కడా పని దొరకలేదు. నేను మద్రాసు వచ్చి రెండు వారాలు గడిచాయి. చేతిలో వున్న కొద్దిపాటి సొమ్ము ఖర్చయిపోయింది. భోజనానికి ఇబ్బంది ఏర్పడింది. మరో దారితోచక రైల్లో పరిచయమైన స్నేహితుడి ఇంటికి వెళ్ళాను. దేవుడి దయవల్ల నేను అక్కడికి వెళ్ళే సమయానికి అతను ఇంట్లోనే ఉన్నాడు. నా రాకను చూసి అతడికి చాలా సంతోషం కలిగింది. కుశలప్రశ్నలయ్యాక నాకు ఉద్యోగం దొరకలేదని అతడికి తెలిసింది. అతనికి ఒక కూతురు, దూరపు బంధువైన కోడలూ ఉన్నారు. వాళ్ళిద్దరికీ పాఠాలు చెప్పడానికి వీలవుతుందా అని నన్ను అడిగాడు. ఏమీ పనీ లేని నాకు అదే గొప్ప పనిగా అనిపించింది. పాఠాలు చెప్పడానికి అంగీకరించాను.

మరుసటి రోజు నుంచి పాఠం చెప్పడానికి ఉపక్రమించాను. అతడి కూతురికి పద్నాలుగేళ్ళు. మేనకోడలికి పదాహారేళ్లు. అతడి కూతురు లక్షణంగా ఉంది. అయితే కోడలు అత్యంత సౌందర్యవతి. చదువులోనూ ఆమె అలాగే ఉంది. కూతురు తగినంతగా నేర్చుకుంటుంది. కోడలికి ఒకసారి చెప్పటమే ఆలస్యం. వెంటనే నేర్చుకునేది. కూతురికి

మాటలెక్కువ. కోడలు అడిగిన ప్రశ్నకు సమాధానం తప్ప మరొక్క మాట ఎక్కువ మాట్లాడేది కాదు. కూతురిది సదా హసన్ముఖం. కోడలి సుందరమైన ముఖం ఏదో దిగులుతో వాడి ఉండేది. దిగులు వల్ల వాడినా ఆ ముఖంలో అదొక విధమైన; ఎంత చూసినా తనివితీరని సౌందర్యం. కూతురి పేరు సీత. కోడలిపేరు శాంతి.

నేను పాఠాలు చెప్పటం మొదలుపెట్టి ఆరు నెలలు గడిచాయి. అమ్మాయిలిద్దరూ బాగానే పాఠాలు నేర్చుకునేవారు. అయితే శాంతి అంత చురుగ్గా సీత నేర్చుకునేది కాదు. శాంతి సౌందర్యం, సౌందర్యాన్ని ఆవరించిన దుఃఖం, చదువు పట్ల ఆమెకున్న అభిరుచి, మితమైన మాటలు ఇవన్నీ కలిసి నా మనసును ఆమె వైపు లాగసాగాయి. ఎంత చూసినా ఆమెను మరొకసారి చూడాలనిపించేది. హైకోర్టు జడ్జిగారి చెల్లెలి కూతురైనా, ఆమె తల్లి తండ్రులు అంత స్థోమత ఉన్నవారు కారు. వారు కూతురి వివాహానికి అనేక ప్రయత్నాలు చేశారు. కానీ పేదరికం వల్ల వరకట్నం ఇవ్వలేక ఇంకా కూతురి వివాహం చేయలేదు. నాకైతే ఎప్పుడూ శాంతి జపమే చేయాల్సి వచ్చింది. పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని అనిపించింది. కాని ఆమెను వివాహం చేసుకుంటే లండన్ వెళ్ళటం కుదరదు. అందువల్ల ఆమెను మరచిపోవటానికి ప్రయత్నించసాగాను. ఎంత ప్రయత్నించినా ఆమె సద్గుణాలు నా మనసును ఆమె వైపు లాగసాగాయి. నేను సీతను పెళ్ళాడి ఉండొచ్చు. ఎన్నో సార్లు ఆమె తండ్రి నన్ను తమాషాగా 'అల్లుడు' అని పిలిచేవాడు. ఆయనకు ఆమె ఒక్కతే కూతురు. నాకు ఆమెనిచ్చి పెళ్ళి చేసి నన్ను ఇల్లరికపు అల్లుడిగా చేసుకోవాలనే కోరికా ఆయనకుంది. నేను వారి అల్లుడైతే సులభంగా లండన్‌కు వెళ్ళవచ్చు. అయితే ఎప్పటి నుంచి శాంతిని ప్రేమించటం మొదలుపెట్టానో అప్పటి నుంచి డబ్బు కోసం ప్రేమను బలి ఇవ్వకూడదని నా మనసు చెబుతోంది. అయితే నాలో ఇంకా లండన్ వెళ్ళాలనే ఆశ తగ్గలేదు. అందువల్ల శాంతి తల్లితండ్రుల నుంచి భిక్ష వేడటానికి నేనింకా సిద్ధం కాలేదు.

తొమ్మిది గంటలైంది. నేను రీడింగ్ రూంకు వెళ్ళి నా ఇద్దరి శిష్యుల కోసం ఎదురుచూడసాగాను. నిజం చెప్పాలంటే నేను ఎదురు చూస్తోంది శాంతి కోసం. శాంతిని స్మరిస్తుండగానే తలుపు తెరిచిన చప్పుడైంది. తెరిచిన తలుపు నుంచి లోపలికి వచ్చింది సీత. ఎప్పుడూ ఆమెతో పాటు వస్తున్న శాంతి జాడ లేదు. ఆమె కనిపించక పోవడంతో మనస్సుకు విషాదం కలిగింది. హఠాత్తుగా 'శాంతి ఎక్కడ?' అని అడగటానికి కొంచెం సంకోచం కలిగింది. అయితే నేను అడగటానికి మునుపే ఆమె "చూశారా సార్, నిన్న రాత్రి శాంతి తండ్రి వచ్చి ఆమెను ఊరికి తీసుకుని వెళ్ళిపోయాడు. ఎందుకో తెలుసా? వివాహం చేయడానికి" అంది.

అప్పుడు నాకు అర్థమైంది. శాంతి లేకుండా నేను బతకలేనని. మొదటే ఆమె

తల్లితండ్రులను అడగనందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. ఇప్పుడేమి చేసినా ప్రయోజనమేమిటి? డబ్బుమీది ఆశతో నా జీవితాన్ని నేనే నాశనం చేసుకున్నాక అర్థమైంది. 'శాంతి' విహీన ప్రపంచంలో జీవించటం నా వల్ల అసాధ్యమని గ్రహించాను. శాంతిని పోగొట్టుకుని ఆ రోజంతా అశాంతితో గడిపాను. మరుసటి రోజు పొతాల వేళకు సీత నాకొక ఉత్తరం చూపింది. ఆ రోజు ఉదయం పోస్ట్ ద్వారా శాంతి నుంచి సీతకు వచ్చిన ఉత్తరమది.

'స్నేహమయి సీతా, సంతోషంగా ఉన్న నిన్ను ఈ ఉత్తరం ద్వారా దుఃఖానికి గురిచేస్తున్నాను. క్షమించు. నీకు నా వ్యధ గురించి రాయటం లేదు. అయితే ఈ ప్రపంచంలో నాకు నీకన్నా వేరే స్నేహితులూ ఎవరూ లేరు. నీకు చెప్పకుండా ఇప్పటిదాకా నేనే పనీ చేయలేదు. ఇప్పుడు చేయబోయే ఈ పనినీ నీకు చెప్పకుండా చేయను.

మా నాన్న నా వివాహం నిర్ణయించారు. నాన్న కన్నా వయస్సు మీరిన వరుడితో. మూడవ పెళ్ళికి నేను వధువును. వరుడికి నలుగురు మనవళ్ళు ఉన్నారు. వరకట్నం ఇవ్వటానికి శక్తి లేనందున నాకు ఇంతకు మునుపు నిశ్చయమైన వరుడు నన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరించలేదట. సీతా, ఆ ముసలివాడికి భార్యగా చచ్చిన శవంలా జీవితాన్ని గడపటం కన్నా నాకు మరణమే మేలని అనిపిస్తోంది. ఆ మేలైన కార్యాన్ని ఎందుకు చేయకూడదు? ఆత్మహత్య పాపం అని జనం అంటారు. ముసలివాడి మెడకు చిన్న పిల్లను ముడిపెట్టడం పుణ్యమైతే నాకు ఆ పుణ్యం కంటే ఆత్మహత్యా పాపమే మేలనిపిస్తోంది. నీకు ఈ ఉత్తరం చేరేసరికి నీ నిర్భాగ్యపు సహచరి ఈ ప్రపంచం నుంచి వెళ్ళిపోయి ఉంటుంది. 'ఆత్మహత్య చేసుకున్న పాపి' అని నీవొక్కదానివైనా నిందించవని నాకు తెలుసు. క్షమించు.

నీ

శాంతి.

శాంతి రాసిన ఉత్తరం చదివాను. శాంతిలాంటి బంగారు బొమ్మను ఇవ్వటమే కాకుండా వరకట్నం కూడా ఇవ్వాలని అడిగిన నీచుడ్ని శపించాను. గతంలో నేను ఒకసారి పేదింటి పిల్లను పెళ్ళాడటానికి తిరస్కరించటం ఆ దుఃఖపు తీవ్రతలో మరిచేపోయాను. విధాతను తిట్టాను. విధాతను తిట్టటానికి బదులుగా నేనే నా దురాశను వొదులుకుని శాంతిని పెళ్లాడి ఉంటే ఆ ముగ్ధబాలిక ఇప్పుడు సుఖంగా ఉండేది. నా తప్పుకు నన్ను నేనే నిందించుకున్నాను. వరకట్నమనే పిశాచి ఎంతటి సుకుమారులను బలితీసుకుంటుందో దేవుడికే తెలుసు. అయితే నా శాంతిని అది బలితీసుకున్న తరువాతే నాకు దాని నిజ స్వరూపమూ అర్థమైంది.

*****

ఆ రోజు రాత్రి ఊరికి బయలుదేరాను. మరుసటి రోజు పొద్దుటే ఇల్లు చేరాను. నేను వెళ్ళేటప్పటికి అమ్మ ఇంటి ముంగిట్లో ముగ్గులు వేస్తోంది. నా తండ్రి, వి ఇద్దరూ లోపలున్నారు. నన్ను చూడగానే అమ్మ సంతోషంతో ముందుకు వచ్చి కౌగిలించుకుంది. అమ్మను పలకరించి లోపలికి నడిచాను. నా తండ్రి మధ్య ఇంటిలో కూర్చుని ఉన్నారు. నన్ను చూసినా మాట్లాడలేదు. నేను అక్కడ ఆగకుండా నా గదిలోకి వెళ్ళాను. అక్కడ విజయ ఒక చిత్రాన్ని చూస్తూ నుంచుని ఉంది. నన్ను చూడగానే ఆ చిత్రాన్ని దాచింది. ఆశ్చర్యంతో "వి, ఏం చేస్తున్నావు?" అని అడిగాను. అప్పుడామె తాను చూస్తున్న న్యూస్ పేపర్‌ను నా ముందుకు జరిపి, "నేను చూస్తున్నది 'నీవు చంపిన అమ్మాయిని' " అంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. పత్రికను ఆత్రంగా తీసి చూస్తే-

శాంతి ఫొటో-దాని కింద వరకట్నానికి ఆహుతి.

శాంతియేనా నేను మొదట వొదులుకున్న కన్య?

ఇప్పుడు .... ఏం ప్రయోజనం ! ...

*****

(రచనా కాలం :1932)

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Nalupu+Telupu+Konni+Rangulu](http://kinige.com/book/Nalupu+Telupu+Konni+Rangulu)**

* * *